క్లుప్తంగా

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం రూరల్: ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ఆర్‌డీఓ వసంత్‌బాబు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో ఎరువుల దుకాణ యజమానులు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన విత్తనాలు ఎరువులు, పురుగుల మందులు మాత్రమే విక్రయించాలన్నారు. కాలం చెల్లిన మందులను రైతులకు అంటకట్టరాదన్నారు. స్టాక్ రిజిష్టర్లు, బిల్లు బిక్కులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలన్నారు. అనుమతులు లేని ఎరువులను అమ్మకాలు చేస్తే షాప్ సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ ఎల్లప్ప, వ్యవసాయ అధికారులు శ్రావణ్, పృథ్వీ పాల్గొన్నారు.

నేడు వినతిపత్రం అందజేత

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం పర్యటనకు వస్తున్న రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అం దించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు పార్టీ వివిధ విభాగాల నాయకులు సుధీర్, బిక్కిహరి, షేక్షావలి, గూబనపల్లి నాగరాజు, సురేష్, టైలర్ శీను మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనరీ సమావేశాలు జయప్రదం చేయండి


పోస్టర్లను విడుదలచేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

రాయదుర్గంటౌన్: శింగనమల నియోజకవర్గ కేంద్రంలో ఆగస్టు 4,5 తేదీల్లో జరగనున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ప్లీనరీ పోస్టర్లను విడుదల చేశా రు. శివ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ పోరాటానికి ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాజేష్, శ్రీసాయి, ముత్తప్ప, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పోటాపోటీగా వాహనాల వేలం

బొమ్మనహాళ్: వివిధ కేసుల్లో పట్టుబడిన ఎనిమిది వాహనాలకు ఎస్‌ఐ శివ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ జయనాథ్‌రెడ్డి, ఏఎస్‌ఐ రామదాసులతో కలసి మంగళవారం వేలం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో నాలుగు నాలుగు చక్రాల వాహనాలు, నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలం వేశారు. జీఎస్టీతో కింద రూ.21830తో కలిపి మొత్తం రూ.1,09150 ఆదా యం ప్రభుత్వానికి వచ్చిందని అధికారులు తెలిపారు.


కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం వేలం నిర్వహించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ మోహన్‌రెడ్డి, డీటీఎఫ్ ప్రొహిబిషన్ జయనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వేలం వేశారు. ఈ వేలం ప్రకటనలో 14ద్విచక్ర వాహనాలు వేలం వేయగా ప్రభుత్వానికి రూ.97,70,400 ఆదాయం వచ్చిదన్నారు. అనంతరం కర్ణాటక మద్యం, ఆంధ్ర మద్యం, 35 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సోమశేఖర్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ


ఎర్రిస్వామిని పరామర్శిస్తున్న రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి

బ్రహ్మసముద్రం : ఇటీవల ప్రమాదానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న డీలర్ల సంఘం మాజీ అధ్యక్షుడు ఎరడికెర ఎర్రిస్వామిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయతిప్పేస్వామి మంగళవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి గోపాల్‌రెడ్డి, జిల్లా బూత్ కమిటీ విభాగం కార్యదర్శి మహేష్‌స్వామి, నాయకులు జిన్నా మల్లికార్జున, హనుమంతు, గోవింద, సంతోష్ పాల్గొన్నారు.

చెరువు తూము ఏర్పాటుకు సర్వే


సర్వే చేస్తున్న అధికారులు

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట చెరువుకు తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) నుంచి తూము ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. కణేకల్లు సర్వే అధికారులు హెచ్చెల్సీ కాలువపై మంగళవారం సర్వే చేశారు. ప్రధాన కాలువ పక్కన హెచ్చెల్సీ భూమి, రైతుల భూములు ఎక్కడి వరకు ఉన్నాయో చూసి తూము ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తుంగభద్ర ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ కేశవరెడ్డి తెలిపారు.

పార్థా...హామీ నెరవేరేనా?

- 2014-19 ఇళ్ల నిర్మాణ బిల్లుల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
- నియోజకవర్గంలో నేటికీ 3,622 మంది నిరీక్షణ
- రూ.6.89 కోట్ల బిల్లుల పెండింగ్
- నేడు దుర్గంలో మంత్రి కొలుసు పార్థసారథి పర్యటన


కళ్యాణదుర్గం మండలం బోరంపల్లిలో 2014-19 మధ్య ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించిన ఇల్లు

వాస్తవ పరిస్థితి ఇదీ..

- కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన శారద(పేరుమార్చాం)కు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద ఇల్లు మంజూరైంది. అప్పట్లో 2019 ఎన్నికల ముందు హడావుడిగా ఏడాదిలోపే ఇల్లు కట్టుకోవాలంటే ఉన్న ఇంటిని తొలగించి కొత్త ఇంటి నిర్మాణం చేపట్టింది. అప్పట్లో కేవలం గోడ స్థాయి వరకు బిల్లు మాత్రమే వచ్చింది. ఇప్పటికీ టాప్ బిల్లు, పూర్తి బిల్లు రాలేదు. మరోసారి టీడీపీ అధికారంలోకి రాగానే బిల్లులు వస్తాయని హౌసింగ్ అధికారులు వచ్చి ఫొటోలు తీసుకొని వెళ్లారు. ఇప్పటికీ బిల్లులు రాక ఆమె అవస్థలు పడుతోంది.

కళ్యాణదుర్గం: ' ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం మేరకు 2014-19 మధ్య నిర్మించిన ఇళ్లకు కూడా డబ్బులు చెల్లిస్తాం.. ఇదీ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక 2024 ఆగస్టు 20న అమరావతిలో గృహ నిర్మాణ శాఖ సమీక్షలో చేసిన వ్యాఖ్య.. కానీ నియోజకవర్గంలో చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల బిల్లులు అందక అవస్థలుపడుతున్నారు.

2014-19 ఇంటి బిల్లులు ఏవీ?

2014-2019 మధ్య కాలంలో నియోజకవర్గంలో ఎన్టీఆర్ పథకం కింద నిర్మించిన ఇళ్ల బిల్లులు నేటికీ మంజూరు కాలేదు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అప్పట్లో దాదాపుగా 4,760 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటికీ బీబీఎల్, బీఎల్, బీసీ, ఆర్‌సీ స్థాయిలలో 3,622 ఇళ్లు ఉన్నాయి. వీటన్నింటినీ దాదాపుగా పూర్తి చేయడానికి రూ.6.89 కోట్లు అవసరం ఉంది.

ఏడాది పాలన పూర్తయినా అమలుకాని హామీ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది దాటినా గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదు. దీంతో గృహ నిర్మాణ లబ్ధిదారులు మంత్రి హామీపై మండిపడుతున్నారు. ఒక్క కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనే నేటికీ 3,622 మంది లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకుని బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇలా దాదాపుగా గతంలో లబ్ధిదారులకు రూ.6.89 కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నట్లు సమాచారం.

నియోజకవర్గంలో మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాలు ఇలా..

మండలం	పెండింగ్‌లో ఉన్న ఇళ్లు	పెండింగ్‌లో ఉన్న బిల్లులు (కోట్లలో)
బ్రహ్మసముద్రం	735	రూ.1.06
కళ్యాణదుర్గం	846	రూ.1.86
కంబదూరు	548	రూ.0.62
కుందుర్పి	731	రూ.1.80
శెట్టూరు	762	రూ.1.55
మొత్తం	3,622	రూ.6.89

నేడు దుర్గంలో మంత్రి పర్యటన

సుపరి పాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి కళ్యాణదుర్గం మండలం చాపిరి గ్రామానికి ఇన్‌చార్జ్ మంత్రి, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం హాజరుకానున్నారు. ఆర్డీఓ వసంతబాబు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, హౌసింగ్ డీఈ విజయ్ భాస్కర్ రావు, తహసీల్దార్ భాస్కర్ మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం


సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: దుద్దేకుంట సచివాలయ ఉద్యోగులను మంగళవారం సన్మానించారు. బదిలీ అయిన సర్వేయర్ నీలకంఠ, డిజిటల్ అసిస్టెంట్ దస్తగిరి, మహిళా పోలీస్ కోమలి, అగ్రికల్చర్ అసిస్టెంట్ అర్చన, హౌసింగ్ విమలను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ తిమ్మప్ప, స్థానికులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కలసికట్టుగా సాధించుకుందాం

కళ్యాణదుర్గం రూరల్: కలసికట్టుగా ప్రాజెక్టులను సాధించుకుందామని వివిధ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని వాల్మీకి భవన్‌లో అఖిలపక్ష నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ పాలకులు మారినా కళ్యాణదుర్గం అభివృద్ధి చెందలేదన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి భైరవానతిప్పకు నీరు అందించాలన్నారు. పార్టీలకతీతంగా పోరాటం చేసి కళ్యాణదుర్గానికి సాగునీటి ప్రాజెక్ట్ పూర్తి చేసి, 114 చెరువులకు నీరు సాధించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ సుధీర్, శెట్టూరు మండల కన్వీనర్ రాయుడు, సీపీఐ గోపాల్, జేఏసీ రాష్ట్ర నేత సాకే హరి, నిజవల్లి బాబు, ప్రతాప్, భీమేష్, వివిధ పార్టీ నేతలు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్ నిర్వహణ అధ్వానం


కూడేరు ఎస్సీ హాస్టల్‌లో ఇడ్లీ, చెట్నీని పరిశీలిస్తున్న విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్ర రెడ్డి

కూడేరు: కూటమి పాలనలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల నిర్వాహణ అధ్వానంగా ఉందని, మౌలిక వసతులు సరిగా లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్ర రెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఉదయం కూడేరు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని విద్యార్థి విభాగం నాయకులతో కలిసి సందర్శించారు.స్నానపు గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. పిల్లలకు ఏర్పాటు చేసిన ఇడ్లీ , చెట్నీ తిని రుచి చూశారు. ప్రభుత్వం గత నెలలో అందజేసిన స్కూల్ బ్యాగులను పరిశీలించగా, అవి చినిగిపోయి ఉండడాన్ని గుర్తించారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిశాంత్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ రెడ్డి,బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేంద్ర, రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోగుల పుల్లయ్య, జాయింట్ సెక్రెటరీ నవీన్, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు ధనుంజయ, పార్టీ నేతలు అశోక్, వేణు, వినోద్ పాల్గొన్నారు.

బీసీ వసతి గృహాలపై చర్చకు సిద్ధం


మాట్లాడుతున్న బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేంద్ర

కూడేరు: బీసీ హాస్టళ్ల అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నాం.. స్థలం, సమయం చెప్పాలని మంత్రి సవితకు వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జల్లిపల్లి దేవేంద్ర, రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోగుల పుల్లయ్య సవాల్ విసిరారు. మంగళవారం కూడేరులో వారు మాట్లాడారు. బీసీ హాస్టళ్ల అభివృద్ధిపై చర్చకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సిద్ధమా? అని మంత్రి సవిత విసిరిన సవాల్‌పై వారు స్పందించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎందుకు.. మీ సవాల్‌కు తాము చాలు అని అన్నారు. మధ్యాహ్న భోజనానికి 2014-19 వరకు మీరు రూ.450 కోట్లు ఖర్చు చేస్తే, వైఎస్సార్ సీపీ హయాంలో రూ.1400 కోట్లు ఖర్చు పెట్టినట్లు గుర్తు చేశారు. గత టీడీపీ పాలనలో రోజూ సాంబర్,అన్నంతో సరిపెడితే.. వైఎస్సార్ గోరు ముద్ద పేరిట రోజుకో మెనూ చొప్పున వారానికి 16 రకాల పదార్థాలతో రుచి, శుచితో పిల్లలకు పోషకాహారాన్ని అందించామన్నారు. మీరు చర్చకు వస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీసీ హాస్టళ్ల అభివృద్ధికి ఖర్చు పెట్టిన వివరాలను వివరిస్తామని సవాల్ విసిరారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నవీన్ కుమార్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, నేతలు ధనుంజయ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు


విద్యార్థులకు అందించిన స్కూల్ బ్యాగ్‌లను చూపుతున్న దృశ్యం


కళ్యాణదుర్గం ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు షేక్షా అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్సీ కాలేజ్ బాయ్స్ హాస్టల్‌ను వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, భోజన నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు ఎరుకుల అజయ్, యూత్ వింగ్ చరణ్, మున్సిపాలిటీ విభాగం దొడగట్ట మురళి, గూజనపల్లి నాగరాజు, బిక్కిహరి, రమేష్, రాజ్‌కుమార్, వన్నూరస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో వసతులు కల్పించండి

శెట్టూరు : కూటమి ప్రభుత్వంలో సంక్షేమ హాస్టళ్లలో వసతులు కరువయ్యాయని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు విమర్శించారు. మంగళవారం శెట్టూరు ఎస్సీ సంక్షేమ హాస్టల్‌ను వారు సందర్శించారు. విద్యార్థులకు అందించే భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను నిర్వీర్యం చేసిందన్నారు. హాస్టల్‌లో 150 మంది విద్యార్థులు ఉండగా, సరైన సౌకర్యాలు లేవన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు నవీన్ కుమార్, వైఎస్సార్ ఎస్‌యూ సీనియర్ నాయకుడు ఎనుములదొడ్డి బాబు, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

దళిత ద్రోహి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ దళిత విభాగం నాయకులు

కణేకల్లు: దళిత ద్రోహిగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు నిలిచిపోయారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పూలచెర్ల సురేష్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు జయప్రకాష్, రాజశేఖర్, ఎర్రిస్వామి, వంశీతో కలిసి సురేష్ విలేకరులతో మాట్లాడారు. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో కామాంధుల చేతిలో బలైన బాలికకు న్యాయం చేసేందుకు దళిత ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు మనసు రాలేదన్నారు.మద్దతుగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్,యువజన విభాగం నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ నాయకులు సన్యాసులు... మడకశిరకు వచ్చి వెనక్కి వెళ్లగలరా? అంటూ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఏడుగుర్రాలపల్లికే వస్తాం.. నీ పరపతి ఉపయోగించి మాకు అనుమతి ఇప్పిస్తావా? అంటూ ఎంఎస్ రాజును ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయలేకపోతే మౌనంగా ఉండాలని హితవుపలికారు.

మహిళల రక్షణకు శక్తిటీమ్


శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ

రాయదుర్గంటౌన్: మహిళల రక్షణ, భద్రత కోసమే ప్రభుత్వం శక్తి టీమ్‌లు ఏర్పాటయ్యాయని రాయదుర్గం పోలీస్ సర్కిల్ శక్తి టీమ్ సభ్యులు ఏఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని బాలికల హాస్టళ్ల శక్తి టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు శక్తి యాప్ వినియోగం, మహిళల రక్షణ, భద్రత విషయాలపై అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ నజీర్‌ఖాన్, డబ్ల్యుపీసీ అశ్విని పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన కళ్యాణదుర్గం నేతలు




వైఎస్ జగన్‌ను కలిసిన తలారి రంగయ్య, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్లు గొల్ల సూరి, పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి , మండల ఉపాధ్యక్షుడు మల్లాపురం మల్లి

కళ్యాణదుర్గం రూరల్: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సమన్వయకర్త తలారి రంగయ్య, మండల కన్వీనర్ గొల్ల సూరి, మండల ఉపాధ్యక్షుడు మల్లాపురం మల్లి, యుజవన విభాగం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు యాదవ్, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతురెడ్డి మంగళవారం మర్యాద పూర్వ కంగా కలిశారు.

అధినేతను కలిసిన బ్రహ్మసముద్రం నాయకులు

బ్రహ్మసముద్రం : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో కళ్యాణదుర్గం నియోజక వర్గ సమన్వయకర్త తలారి రంగయ్యకలిసి మంగళవారం కలిశారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకు?

శెట్టూరు: సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు ఎందుకు నిర్వహించాలని సభ్యులు అధికారులను నిలదీశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సభ్యులు సమస్యలపై చర్చించారు.గత సమావేశాల్లో అధికారుల దృష్టికి తెచ్చిన ఒక్క సమస్యనైనా పరిష్కరించారా? అని అధికారులను నిలదీశారు. ఉపాధిహామీ కింద పండ్ల తోటలు పెంచుకున్న రైతులకు 8 నెలలుగా బిల్లులు అందించలేదని, రూ.1.80 కోట్లు అందాల్సి ఉందన్నారు. ఉపాధి కూలీలకు రూ.15లక్షలు అందాల్సి ఉందన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో తాగునీరు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పక్కా ఇళ్ల నిర్మాణం ఊసేలేదన్నారు. కొందరు అర్హతలేకున్నా ప్రైవేట్ క్లినిక్‌లు నడుపుతున్నారని సమావేశం దృష్టికి తెచ్చారు. వీరివల్ల అనేక మంది పేదలు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ వైద్యులు సక్రమంగా విధులకు హాజరుకాకపోవడం వల్ల, పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అందకపోవడం వల్లే ఆర్‌ఎంపీలు పుట్టుకొస్తున్నారన్నారు. ప్రభుత్వం పంటల బీమా ఇవ్వలేదని, పరిహారం ఇవ్వలేదని, దీంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ రఘురాం, వైస్ ఎంపీపీ ముత్యాలు, చెవుల కిష్టప్ప, సర్పంచులు సత్యనారాయణ రెడ్డి, కుమార్, తిమ్మరాజు, చెన్నకేశవులు, ఎంపీటీసీలు నరసింహులు, గీతమ్మ, లింగప్ప, నాగమణి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం


సర్పంచు మోనాలిసాను సన్మానిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరుకావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ రమావత్‌దేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ దామోదర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ వెంకటాంపల్లి పెద్దతండాకు చెందిన తులసీదాస్‌నాయక్ అనే రైతుకు రెండున్నర ఎకరాల పొలం ఉండగా, ఆన్‌లైన్‌లో 40 ఎకరాలు చూపుతోందని, దీతో సంక్షేమ పథకాలు వర్తించలేదని అన్నారు. ఎంపీటీసీలు మునయ్య, పాపన్న తదితరులు సమస్యలు సమావేశం దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయలేదని సర్పంచు మల్లెల జగదీష్ అన్నారు. ఎంపీటీసీ ఈశ్వరమ్మ, సర్పంచు భూమా కుమలమ్మ సమస్యలు సమావేశం దృష్టికి తెచ్చారు.

సర్పంచు మోనాలిసాకు సన్మానం

స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు మల్లెల జగదీష్ ఆధ్వర్యంలో సర్పంచు మోనాలిసాను మంగళవారం సన్మానించారు. ఇటీవల సర్పంచు మోనాలిసా ఢిల్లీలో జరి గిన శిక్షణకు హాజరై, ప్రతిభ కనబరిచారన్నారు.

రాయదుర్గంలో కార్మికుల నిరసన ర్యాలీ


రాయదుర్గంలో నిరసన ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

రాయదుర్గంటౌన్: పారిశుధ్య పనులు కాంట్రాక్టర్లకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ నెల్లూరులో నిరసన తెలుపుతున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై పోలీసుల లాఠీచార్జీ అమానుషమని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం రాయదుర్గంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు ర్యాలీ చేశారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి వినాయక సర్కిల్ వరకు ర్యాలీ చేశారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని టీసర్కిల్లో మున్సిపల్ కార్మికులు మంగళవారం నిరసన తెలియజేశారు. నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై దాడి చేయడాన్ని నిరసిస్తూ కళ్లకు గంతలు కట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు.

సెప్టెంబర్ 15 లోపు రైతు విస్తృత సర్వే పూర్తి చేయాలి


విస్తృత సర్వేను పరిశీలిస్తున్న డీడీ రమేష్ రెడ్డి

కూడేరు: రైతు విస్తృత సర్వే సెప్టెంబర్ 15లోపు పూర్తి చేయాలని పశు సంవర్ధక శాఖ డీడీ రమేష్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన కూడేరులో జరిగిన రైతు విస్తృత సర్వే ప్రక్రియను తనిఖీ చేశారు. అనంతరం ఆయన పశువైద్యశాలలను సందర్శించారు. మండల వ్యాప్తంగా విస్తృత సర్వే పురోగతిపై పశు వైద్యాధికారి శ్రీనివాసులుతో ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీ సురేష్, పశు వైద్యాధికారి శ్రీనివాసులు, ఏహెచ్‌ఏలు భవాని, దామోదర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. సమావేశంలో పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు.

'విలువల విద్య' పుస్తకాల సరఫరా

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన 'విలువల విద్య' పుస్తకాలు విద్యాశాఖ కార్యాలయానికి మంగళవారం సరఫరా అయ్యాయి. ఈ మేరకు ఎంఈఓ-2 వెంకటరమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఈ పుస్తకాలను అందజేయనున్నట్లు చెప్పారు. పట్టణం, రూరల్ పరిధిలోని పాఠశాలల హెచ్‌ఎంలకు వీటిని అందజేయనున్నట్లు తెలిపారు.

కుందుర్పి తహసీల్దార్‌గా ఓబులేసు

కుందుర్పి: కుందుర్పి నూతన తహసీల్దార్‌గా ఓబులేసును ప్రభుత్వం నియమించింది. ఈనెల 31న తహసీల్దార్ శ్రీనివాసులు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో దీర్ఘకాలికంగా సెలవులో ఉన్న ఓబులేసును కుందుర్పి తహసీల్దార్‌గా నియమించారు. గతంలో ఓబుళేసు కుందుర్పి రెవెన్యూ కార్యాలయంలో డీటీగా పనిచేసిన అనుభవం ఉంది.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కూడేరు: 2025-26లో పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికతో విద్యాబోధన చేయాలని మండల విద్యాధికారి-2 సాయి కృష్ణ ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం ఆయన మరుట్ల-2వ కాలనీలోని హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో సమావేశమై విద్యా సామర్థ్యం తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధనుంజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

కూడేరు: కమ్మూరు వద్ద మంగళవారం జరిగిన ఆటో ప్రమాదంలో డ్రైవర్ నాగేంద్రనాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. నాగేంద్ర నాయక్ కమ్మూరుకు వెళ్లి తిరిగి కూడేరుకు వస్తుండగా మార్గమధ్యంలో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నాగేంద్రనాయక్ తలకు బలమైన గాయాలయ్యాయి. అతన్ని వెంటనే స్థానికులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటలు వేయండి

కుందుర్పి: భూసార పరీక్షల ఆధారంగానే రైతులు పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం జంబుగుంపల రైతు సేవా కేంద్రంలో రైతులకు భూసార పరీక్షలు, చీడపీడల నివారణ, పంటల సాగు, సేంద్రియ వ్యవసాయం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అంతకు ముందు గ్రామ సమీపంలోని రైతు సోమప్ప పొలంలో భూసార పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ కులశేఖర్, ఎంపీఈఓ మల్లేశ్వరి రైతులు పాల్గొన్నారు.

పంట సాగుపై రైతులకు అవగాహన

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని కోడిపల్లి ఆర్‌ఎస్‌కేలో రైతులకు పంటల సాగుపై వ్యవసాయ అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు టమాట, వేరుశనగ, కంది, మిరప, పండ్ల తోటలకు సోకే తెగుళ్లపై తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మా పీడీ పద్మావతి, ఏఓ శ్రావణ్ కుమార్, ఏఈఓ అలేఖ్య, కేవీకే శాస్త్రవేత్తలు హరిణీ, శిరీష, యుగంధర్, రైతులు పాల్గొన్నారు.

నేమకల్లుకు పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: నేమకల్లు ఆంజనేయస్వామి దర్శనానికి శ్రావణ మాసం మొదటి మంగళవారం సందర్భంగా వేలాదిగా భక్తులు తరలివచ్చి, పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామికి సుప్రభాతసేవ, పవిత్ర గంగా జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వెండి కవచధారణ, వెండి తమలపాకు అలంకరణ, ప్రత్యేకాలంకరణ, ఆకు పూజలు, తులసీ మాలధారణ, ప్రత్యేక పుష్పాలకరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో నాగ పంచమి వేడుకలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని నాగులకట్ట వద్ద శ్రావణమాసం నాగుల పంచమి సందర్భంగా మంగళవారం మహిళలు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నాగదేవతకు ప్రీతికరమైన నోముల దారాలు, నువ్వులు, చలిపిండి తయారు చేసుకుని పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని నాగులకట్ట, పుట్టల వద్దకు చేరుకొని పాలుపోసి పూజలు చేశారు. గుంపునాగప్పల కట్ట, లక్ష్మీ సత్యనారాయణ గుడి ఆవరణలో, వేణుగోపాలస్వామి గుడి, కూననాగప్ప, ఇతరాత్ర ఆలయాల్లో ఉన్న నాగులకట్టల వద్ద పూజలు జరిగాయి.

నేడు సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి బాబా అవతార జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సేవా కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఉదయం 11.30 గంటలకు జరిగే శ్రీదివ్య ప్రేమ ప్రవాహిని రథోత్సవంలో సాయి భక్తులు, సేవాదల్ సభ్యులు, యువత, బాల వికాస్, గురువులు విద్యార్థులు భజన మండళ్లు పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.